# హనుమంతుడొచ్చె



'మిత్రవింద'

"ఆపవయ్యా బాబూ ఆపు! దానికడ్డంగా తోకను పడేసి...వీ వీణా నువ్వూను!"

........ ........

"ఏమయ్యోవ్! నీకు చెముడు కూడా వుందా తోకకు తోడు! కాస్త తోక అడ్డం తియ్ త్వరగా వెళ్ళాలి!"

హనునుంతుడు వీణనుపక్కగా పెట్టాడు. తలెత్తి ఎదురుగా నిల్చున్న స్థూల కాయుడి ముఖంలోకి చూశాడు. ఆ ముఖం చిరపరిచిత మైనదిగా అన్పించింది. కాని అది ఎవరి తాలూకో గుర్తురావడం లేదు. హనుమంతుడు ఆలోచనలో పడ్డాడు.

"ఏమిటయ్యా అట్లా ముఖంలోకి చూస్తావ్? నా ముఖం మీద కోతులాడు తున్నయ్యా? తియ్! తియ్! ఆ తోకను పక్కకు తియ్!"

"ఎవరు డింబకానువ్వు, నన్నే తోక తియ్యమంటున్నావ్? మీ నరులు ఒక వైపు పేర్లకు ముందూ వెనకా అనే విచక్షణ లేకుండా "పద్మశ్రీ, పద్మవిభూషణ్, కళా ప్రపూర్ణ, మొదలైన తోకల్ని తగిలించుకుంటూ వుంటే, నాకు వున్న తోకను తియ్యమంటావేమయ్యా?"

"జనతా ప్రభుత్వంవచ్చి పాపం కొందరి తోకల్ని పీకేసిందిగ? అది సరేగాని నీ తోకను కొంచెం అడ్డం తియ్!"

"నిన్ను ఎక్కడో చూసినట్టుంది! ఎప్పుడో ఇదే కంఠం ఇలాగే నన్ను తోక నడ్డం తియ్యమని అడిగింది. చాలాకాలం అయింది అఁజ్ఞాపకం వచ్చింది. జ్ఞాపకం వచ్చింది. ద్వాపర యుగంలో..." ఆగి, హనుమంతుడు స్థూలకాయుడి ముఖంలోకి దీక్షగా చూడసాగాడు.

"అన్నయ్యా నువ్వా? మీ తమ్ముడు భీమసేనుడు సవినయంగా నమస్కరిస్తున్నాడు!" అంటూ భీముడు వంగి నమస్కరించాడు.

"జగజగాలు దద్దరిల్లగా యుగ యుగాలు వర్ధిల్లు తమ్ముడూ!"

అన్నయ్యా నువ్వసలు ఇక్కడి కెలా వచ్చావ్? ఎందుకొచ్చావ్? గంధమాదన పర్వతం మీద అరటితోటతో వీణవాయించుకుంటూ కాలం గడుపుతున్నావని విన్నానే? ఆ అరటి తోట నుంచి ఈ ఆంధ్ర దేశంలోకి ఎందుకు ప్రవేశించినట్టు?"

"ఎందు కేమిటి? నా వీణా నాదంతో ఐదు కోట్ల ఆంధ్రుల గుండెల్ని..."

"స్పదింప చెయ్యడానికా? నీ కంత శ్రమ ఎందు కన్నయ్యా ఈమని శంకర శాస్త్రి, చిట్టిబాబు లాంటి ఉద్దండులు ఉండగా?"

"నా వీణ మామూలు వీణల రాగాలు పలకదు తమ్ముడూ? ఇక్కడి మనుషల

కథా క్రమామీషూ చూస్తూ వాటి మంచి చెడు లను వ్యాఖ్యానిస్తూ...''

''ఓ అర్థం అయిందిలే! కాని వినాయ కుడి వీణ, మాణిక్య వీణ వుండగా నీ త్రేతా యుగం నాటి తుప్పు పట్టిన వీణను ఎవరు వింటారన్నయ్యా ఈ కలియుగంలో!''

''వినాయకుడి వీణ ఏమిటి? అసలు వినా యకుడికి వీణ వాయించడమే రాదు. కాక పోతే ఎప్పుడైనా డ్యాన్సు చేశాడేమో గాని....''

''ఈ కలియుగంలో వినాయకుడు వీణ వాయించాడు, అద్భుతంగా వాయించాడు. నువ్వు వినలేదేమో గాని...''

''కావచ్చు! వీణ వాయించడం వినాయ కుడి ప్రకృతి కాదు. అది ఆగిపోయింది''

''కాని మాణిక్య వీణ ఇంకా మోగుతూనే వుందిగా?''

''వీణకు మాణిక్యాలు పొదగడం ఏమిటి తమ్ముడూ? కాళిదాసు ఏదో అన్నాడే అనుకో... మనిషికి బతకడానికి వస్త్రైదన్నం దొరకని ఈ కాలంలో మాణిక్యాలు పొదిగిన వీణలు వాయించడం ఏమిటి అర్థం లేకుండా? ఆ వీణా నాదం సామాన్యుడి చెవులకు అందు తుందంటావా? అందుకే ఈ వయసులో, వీణను భుజం మీద వేసుకొని, ఇక్కడ ఈ పీతోఫర్ అనుపతి దగ్గిర తిష్ట వేయ్యాల్సి వచ్చింది. మధ్య మధ్య నీ లాంటి వాళ్లకు నా తోక కాస్త ఇబ్బంది కలుగ జేస్తున్న మాట నిజమేననుకో ... పైగా వచ్చీ రాక ముందే నీకు ఇబ్బంది కలిగించాను. అది సరేగాని నువ్వు ఇలా బయలుదేరావేం? ద్వాపరయుగంలో భార్య మెప్పు కోసం సౌగంధికా పుష్పం కొరకు వెళ్తున్నావనే జాలి కొద్దీ తోక అడ్డం తీశాను. మళ్ళీ ఏమొచ్చింది? ''

భీముడు ముంజేతి వాచీ కేసి చూసు కున్నాడు.

''అయ్యో! చాలా టైం అయింది! అన్నయ్యా కొంచెం ఆ తోక...!''

''ముంజేతికి వాచీ...ఇంగ్లీషు కూడా మాట్లాడుతున్నావ్? ''

''ఇది కలియుగం ... ఇక్కడ ఇవి లేకుండా రోజు గడవటం కష్టం! కొంచెం తోక తీస్తావా మరి?''

''ఎందుకు తమ్ముడూ అంత కంగారు పడు న్నావ్? మా మరదలు పిల్ల మల్లె పువ్వులు తెమ్మన్నదా? ఆలస్యం అయితే అలక పాన్పు ఎక్కుతుందా ఏం?''

''మల్లెపువ్వులు కాదు - తెల్ల కాగితాలు తెమ్మంది!''

''ఎందుకూ? ''

''అయ్యో నీకు తెలియదా? అవున్లే ఇంతకు ముందేగా ఈ ఆంధ్ర దేశంలో అడుగు పెట్టానన్నావు! అందుకే మీ మరదలి కీర్తి ప్రతిష్టల గురించి వినలేక పోయావ్! అలా తెల్లబోయి చూస్తావేం? మీ మరదలు ఒక ప్రఖ్యాత నవలా రచ యిత్రి! మీ మరదలు కథలు సినిమాలుగా కూడా తీశారు. ఏదో మంచి ఐడియా వచ్చిం దట! రాయకపోతే మీ మరదలికి ఊపిరి ఆగిపోయినంత పని అవుతుంది. ఇంట్లో కాగితాలు నిండుకున్నాయ్! వెంటనే తీసుకు రమ్మని పంపించింది. ఆలస్యం అయితే టైం వేస్టయి పోయిందని గొడవ పెట్టే స్తుంది.''

"ఆహా ! హ ! హ ! అదా సంగతి ! ఆ రోజు సౌగంధికా పుష్పం కోసం బయలు దేరావ్ ! ఇవ్వాళ కాగితాల కోసం బయలు దేరావ్ ! నవలలు రాని లోకాన్ని ఉద్ధరిస్తుం దన్న మాట మరదలు పిల్ల ! బాగుంది!"

"అవును అన్నయ్యా ! ఒకటి అడగటం మర్చాను ! లోకాన్ని ఉద్ధరించ డానికే నువ్వూ ఇక్కడికి కొచ్చానన్నావు గదా ! ఆ పని నువ్వు వీణతో చేస్తావా లేక తోక తోనా? "

"మంచి వాళ్ళకు మేళం, చెడ్డ వాళ్ళకు వాలం ! "

"అంటే...నీదు వాలంబునన్ జుట్టి నేలం బడం గొట్టి, నీ ముష్టి ఘాతంబునన్, బాహు దండబునన్, రోమ ఖండంబునన్ ద్రుంచి, కాలాగ్ని రుద్రుండవై ..."

"ఆపు తమ్ముడూ ఆపు ! జనాన్ని ముందే భయపెట్టకు ! ఆలస్యం అయితే మరదలపిల్ల ఇన్‌స్ప్రేషన్ పర్‌స్పెరేషన్‌గా మారగలదు."

"అబ్బో నువ్వూ ఇంగ్లీషు దంచేస్తున్నావే? "

"తప్పుతుందా ? ఇది కలియుగం నాయనా ! "

"తోక తీస్తానా అన్నయ్యా ! "

"అవశ్యం ! " *

---

## మేరీ టేలర్ లేఖ

(31వ పేజీ తరువాయి)

పోయి యింకా తల తిరుగుతోందా? పెట్టిన ఆ రెండు ముద్దలు నోట్లో కుక్కుకోబోయే ముందు ఆ అధ్వాన్నపు టన్నం కెలుకుతూ రాళ్ళు, పూకా, చెత్తా యేరిపారేస్తూ, మాడిన నల్లటి పప్పూ, కుళ్ళిన కూరా అవతలికి నెట్టేస్తూ నువ్వు నా కళ్ళల్లో మెదుల్తావు. నీ ముసలి తల్లిగురించీ, నీ కడసారి చూపుకైనా నోచుకోని నీ తండ్రి గురించి, ఎన్నడో ఆరేళ్ళనాడు చూసిన నీ కన్నబిడ్డ గురించి నువ్వు చెప్పే మాటలు నా చెవుల్లో మోగుతాయి. నీ 'వాళ్ళ'ను గురించి ఎప్పుడేనా సంగతులు తెలుస్తున్నాయా? వాళ్ళకు, నీకు మధ్య పట్టుమని యిరవైమైళ్ళ దూరం లేకపోయినా ఆ కాస్త దూరానికే చార్జీలు పెట్టుకోలేని (లంచాలు యిచ్చుకోలేని) కటిక పేదలు వాళ్ళు; పైగా, భయంకూడానేమో? నువ్వింకా భవిష్యత్తు గురించి, పల్లెకు తిరిగి వెళ్తే కలిగే ప్రమాదాలు గురించి, కామందులకు వ్యతిరేకంగా ఎదురు నిలవండని పేదల్ని ఎక్కడదోశావని కక్షగట్టి నీకోసం కాపేసుకు కూర్చున్న కామందుల మనుషుల్ని గురించి ఆలోచిస్తూనే వున్నావా? నీలాగే అదే జైలు గోడలమధ్య నిర్బంధంలో మగ్గుతూ మాటకు చూపుకు కరువైన నీ భర్త దగ్గర్నుంచీ కాకి కబురైనా అందుకోగల్గావా?

యీవాళ్టి పరిస్థితి యేమిటి? యే బిడ్డ మంచానపడి మందుకు నోచుకోడంలేదు? యే ముసలమ్మ భారంగా ముక్కుతూ మూల్గుతూంది? యే బాలలు బద్దలైన గాయాల్తో, పుండ్లతో గిజగిజలాడుతున్నారు? (బీద వెధవలు వాట్లతో అట్లా బాధపడ్డం అతి మామూలేనంటాడు 'డాక్టరు'). సబ్బుబిళ్ళ కోసం, చాలినంత తిండికోసం, ప్రభుత్వం మొండి మొలల్తో వొదిలేసిన వాళ్ళ ఒళ్ళు కప్పటానికి బట్టకోసం యీవాళ యుద్ధమవు